సాక్షి
చిత్తూరు

ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



ఉగ్రరూపం దాల్చిన బహుదానది

బహుదా నది ఉగ్రరూపం దాల్చింది. వరద నీటితో పరివాహక ప్రాంతాలను ముంచెత్తింది. - 8లో



మళ్లీ ఏనుగుల దాడి

పులిచెర్ల మండలంలో మళ్లీ ఏనుగులు విజృంభించాయి. వరి, వేరుశనగ పంటలను ధ్వంసం చేశాయి. - 8లో



నియామక పత్రాల జారీ

డీఎస్సీ కొత్త టీచర్లకు నియామకపత్రాలు జారీ చేశారు. వారంతా సోమవారం నుంచి పాఠశాలలకు వెళ్లనున్నారు. - 8లో

న్యూస్‌రీల్

వారికి పీఎం ఉపకారవేతన పథకం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మాజీ సైనికుల పిల్లలకు ప్రధాన మంత్రి ఉపకారవేతన పథకం అమలు చేస్తున్నారని జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి రాఘవులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 2025–26 విద్యాసంవత్సరంలో పీఎం ఉపకారవేతన పథకానికి వృత్తి విద్యా డిగ్రీ కోర్సు, ఎంబీబీఎస్, బీడీఎస్, ఎంసీఏ, బీటెక్ (మొదటి సంవత్సరం చదువుతున్నవారు అర్హులే) మొదలైన కోర్సులు చదువుతున్న వారు అర్హులన్నారు. ఈ పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు డిసెంబర్ 31న చివరి తేదీ అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సుల్లో పనిచేసిన మాజీ సైనికులు, మాజీ సైనిక వితంతువులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు www.ksb.gov.i n వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08572–228682 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

హంద్రీ-నీవా కాలువకు అడ్డంగా రాతి గుండ్లు



గుడుపల్లె: మండలంలోని శ్రీ రాళ్లగంగమాంబ ఆలయం వద్ద వెళ్తున్న హంద్రీ–నీవా కాలువలో రాత్రి గుండ్లు జారిపడ్డాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కాలువ పైన ఉన్న గుండ్లు పడుతున్నాయి. కాలువకుపైన ఉన్న రాతి గుండ్లను తొలగించకుండా కింద మాత్రం తూతూమంత్రంగా సిమెంట్ వేసి పనులు పూర్తి చేశారు. దీంతో వర్షం పడే సమయానికి పైన ఉన్న రాతి గుండ్లు పడుతున్నట్టు రైతులు చెబుతున్నారు. కాలువలో వేసిన కాంక్రీట్ కూడా పెచ్చులూడి పడుతున్నట్టు పేర్కొంటున్నారు. వర్షాలు వారం రోజులు పడితే కాలువ పూడిపోయే పరిస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు.

మామిడి బకాయిలు చెల్లించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు సంఘ నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మామిడి రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన రూ.12 చొప్పున ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.500 కోట్లు సత్వరం చెల్లించాలని మామిడి రైతు సంఘం కార్యవర్గం నిర్ణయించింది. శనివారం చిత్తూరు నగరంలోని ఎస్టీయూ కార్యాలయంలో మామిడి రైతు సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు టీ.జనార్దన్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సురేంద్రన్ మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 50 వేల మంది రైతులు తోతాపురి బిల్లుల కోసం పడరాని పాట్లు పడుతున్నారన్నారు. బిల్లులు చెల్లించడంలో ఆలసత్వానికి రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగమే ప్రత్యక్ష బాధ్యత వహించాలన్నారు. రూ.4 సబ్సిడీ చెల్లిస్తామంటూ రెండు నెలలుగా ఊరించడం తగదన్నారు. జిల్లాలో పలు ర్యాంపుల నిర్వాహకులు రూ.2, రూ.3 మాత్రమే చెల్లించారంటే ప్రభుత్వం అంటే వారికి లెక్కలేనితనమా?, లేక వాళ్ల పట్ల నియంత్రణ లేకపోవడమా అని వారు ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మామిడి రైతుల ఆక్రందన సభ ఈనెల 15న బంగారుపాళ్యంలో జరుగుతుందన్నారు. రైతుకు చివరి పైసా అందే వరకు ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యదర్శి బీ.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పీ.హేమలత, బీ.మురళి, త్యాగరాజురెడ్డి, సందీప్, కోశాధికారి, సంజీవ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు అన్నీ నిండిపోయాయి. భక్తులు వేచి ఉన్న క్యూ కృష్ణ తేజ అతిథి గృహం వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 74,468 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,878 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.86 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 20 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

జీఎస్టీ మాయ!





పలమనేరు మున్సిపల్ కార్యాలయం వద్ద టూవీలర్ల ధరలు తగ్గాయని ప్రచారం నిర్వహిస్తున్న అధికారులు

జీఎస్టీ తగ్గింపు అంతా మాయలా మారి పోయింది. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రచార ఆర్భాట అస్త్రంగా మారింది. ధరలు పెంచి జీఎస్టీలో తగ్గించామని చెబితే పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎలా మేలు కలుగుతుందనే మాట జనం నోట వినిపిస్తోంది. పోనీ తగ్గిన ధరలతో దుకాణాల్లో వస్తువుల విక్రయాలు జరుగుతున్నాయా..? అంటే అదీలేదు. మేం కొన్న ధరలకే స్టాకున్నంత వరకు అమ్ముతామని దుకాణదారులు తెగేసి చెబుతున్నారు. ధనికులకు అవసరమైన వస్తువులు, ఎలక్ట్రానిక్స్, బైక్‌ల ధరల తగ్గింపుతో పేదవాడికి ఏమి ఒరుగుతుందని మేధావులు దుమ్మెత్తి పోస్తున్నారు. ప్రభుత్వ శాఖలన్నీ జీఎస్టీతో ఏదో మేలు జరిగిపోయిందని గొప్పలు చెప్పుకుంటూ ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టడంపై మండిపడుతున్నారు.

ధరలు పెంచి జీఎస్టీ తగ్గిస్తే ఎలా మేలు?

- దుకాణాల్లో కనిపించని కొత్త జీఎస్టీ ధరలు
- మెడిసిన్, నిత్యావసరాల ధరలు యథాతథం
- విలాసవంతమైన వస్తువుల ధర తగ్గితే ఏంలాభం
- దీనిపై అన్ని శాఖల ద్వారా ప్రచార ఆర్భాటాలు ఎందుకో?

పలమనేరు: దీపావళి కానుకగా జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు పెద్దగా ప్రయోజనం లేదని చెప్పవచ్చు. ఎందుకంటే వస్తువుల ధర తగ్గించకుండా ట్యాక్స్‌ను తగ్గించినంత మాత్రాన దాని ప్రభావం పెద్దగా కనిపించదు. కొత్త టారిఫ్‌తో 12 శాతం ఉన్న వస్తువులు 5 శాతంలోకి వెళ్లాయి. ఈ సెక్టార్‌లో వ్యత్యాసం 7 శాతంగా ఉంది. దీన్ని బట్టి రూ.1000కి సరుకులు కొంటే రూ.70 తగ్గుతుంది. అంటే ఇప్పుడు మిగులు గతంలో ధర పెంచడం వల్ల కొత్తగా లాభం లేనట్టే. పేదవాడు కొనే ప్లాస్టిక్ బిందెపై 18 శాతం జీఎస్టీ. అదే కోవలో ఏసీలు, ఫ్రిడ్జిలు, వాటర్‌కూలర్లను పెట్టారు. దీంతో ప్లాస్టిక్ బిందెకొనే వారికి నష్టమనే మాట వినిపిస్తోంది.

మందులు కాకుండా..!

ప్రజలకు నిత్యం అవసరమైన మెడిసిన్ కాకుండా అరుదైన వ్యాధుల మందులు, ప్లాస్మా, ప్లేలెట్స్, బీసీసీలాంటి వ్యాక్సిన్స్, డయాగ్నస్టిక్ కిట్స్‌పై ధరలు తగ్గించారు. సాధారణంగా ఎక్కువ మందికి అవసరమైన ట్యాబెట్ల ధరలు అలాగే ఉన్నాయి. జీఎస్టీలో తగ్గింపు జాబితాలోని మందులను సైతం మెడికల్ షాపుల్లో ఇప్పటికీ పాత రేట్లకే అమ్ముతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే కొత్త స్టాకు వస్తే దానిపై ధర తగ్గిస్తామని వ్యాపారులు చెబుతున్నారు.

అధికారుల గొప్పలు..పేదల తిప్పలు

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు జరిగిందని, దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న హంగామా అంతాఇంతాకాదు. బడులు, కళాశాలలు, మున్సిపల్, ఎంపీడీవోలతోపాటు పలు ప్రభుత్వ శాఖలు ఆఖరుకు డ్వాక్రా సంఘాల ద్వారా కూడా నిత్యం ప్రచారాలను నిర్వహించడం కొసమెరుపు.

సామాన్యులకు ఉపయోగం ఉంటేగా



గతంలో సిమెంట్ బస్తా రూ.270గా ఉండేది. దాన్ని రూ.330కి పెంచారు. ఇప్పుడు రూ.20 తగ్గినా పాత ధరకంటే పెరిగిన ధర ఎక్కువేగా. ఇలా మాయచేసి సామాన్యులకు మేలు చేశామంటే ఎలా. నిత్యావసర సరుకులు ధరలను తగ్గిస్తేగానీ పేదలకు మేలు జరగదు.

– సుబ్బన్న, కల్లాడు, పలమనేరు మండలం

5 శాతం

తగ్గిన వస్తువులివే

తాజాగా 5 శాతం శ్లాబ్‌లోకి బిస్కెట్లు, కేక్‌లు, చాక్లెట్లు, సాస్, జామ్, క్యాండిల్స్, గొడుగులు, టేబుల్ ఫ్యాన్లు, సైకిళ్లు, ఆట బొమ్మలు, వస్త్రాలు, క్రీడా సామగ్రి, ట్రాక్టర్లు, కార్లు తదితరాలున్నాయి. కానీ నిత్యావసరాలైన బియ్యం, గ్యాస్, పప్పు, వంట నూనెలు లాంటి సరుకుల ధరలు భారీగా పెరిగాయి. దీంతో పేదలకు ఎలా మేలు జరుగుతుందో అర్థం కావడం లేదని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

మభ్యపెట్టే ప్లాన్ ఇది



ధనిక వర్గాలకు అవసరమైన విలాస వస్తువుల ధరలను జీఎస్టీ ద్వారా తగ్గించారు. ఇప్పుడు జీఎస్టీలో ధర తగ్గిన వస్తువులను పేదలు కొంటారా..?. పేదలకు అవసరమైన నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కేవలం ప్రజలకు మేలు చేశామని మభ్యపెట్టే ప్లాన్ ఇది. ఇలాంటి జిమ్మిక్కులు ప్రజలు నమ్మరు.

– సోమచంద్రారెడ్డి, జిల్లా మేధావుల ఫోరం ప్రెసిడెంట్, పలమనేరు

వేరుశనగ పంట ధ్వంసం



దిగువ మోదలపల్లె వద్ద ధ్వంసమైన వేరుశనగ

తవణంపల్లె: వేరుశనగ పంట చేతికొచ్చే సమయంలో రాత్రుల్లో అడవి పందులు దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. ఒడుపుకొనే సమయంలో కాయలను పూర్తిగా ఆరగిస్తున్నాయి. మండలంలో పలు చోట్ల కోతులు, అడవి పందుల వల్ల పంట దెబ్బతింటోంది. దీనిపై అటవీశాఖ అధికారులు తగు చర్యలు తీసుకొని, నష్టపోయిన పంటకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

15న మామిడి రైతుల ఆక్రందన సభ



గంగాధర నెల్లూరు: బంగారుపాళ్యం మార్కెట్ యార్డు వద్ద ఈనెల 15న మామిడి రైతుల ఆక్రందన సభ నిర్వహించనున్నట్టు జిల్లా అధ్యక్షుడు జనార్దన్ తెలిపారు. గంగాధరనెల్లూరు మండల కేంద్రంలో మామిడి రైతులతో ఆక్రందన సభకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. మామిడి రైతులకు దాదాపు రూ.500 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మామిడి రైతు సంఘం కార్యదర్శి బెల్లంకొండ శ్రీనివాసులు, ఉపాధ్యక్షురాలు హేమలత, నేతలు త్యాగరాజులరెడ్డి, సందీప్‌రెడ్డి, పురుషోత్తం, నరసింహులు, రాజేంద్ర నాయుడు, మోహన్‌రెడ్డి, చక్రవర్తి పాల్గొన్నారు.

నా కొడుకుని బతికించండి

- తొమ్మిదేళ్ల చిన్నారికి దెబ్బతిన్న లివర్
- శస్త్రచికిత్సలకు రూ.20 లక్షల వరకు అవసరం
- తల్లడిల్లిపోతున్న పేద తల్లిదండ్రులు



కొడుకు వెంకటేష్‌తో తల్లి నీతూ

గంగాధరనెల్లూరు: 'ఒక్కగానొక్క కొడుకు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పట్టుమని పదేళ్లు నిండకుండానే లివర్ సమస్యతో అల్లాడిపోతున్నాడు. రోజురోజుకీ బిడ్డ ఆరోగ్యం క్షీణిస్తోంది. అతన్ని చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. కాపాడుకోవడానికి చేతిలో చిల్లిగవ్వలేదు. ఎలా బతికించుకోవాలో అర్థం కావడం లేదు. సాయం చేసే చేతుల కోసం ఆశగా ఎదురు చూస్తున్నాం.' అంటూ కడుపులో బాధ దిగమింగుకుని, కళ్లల్లో నీళ్లు పెట్టుకుని గంగాధరనెల్లూరు మండలం, తూగుంద్రం పంచాయతీ, బాలయ్యకొత్తూరు గ్రామానికి చెందిన దంపతులు నీతూ, నరసింహారెడ్డి వేడుకుంటున్నారు. వివరాలు.. నీతూ, నరసింహారెడ్డికి వెంకటేష్ (9), చంద్రిక (7) పిల్లలున్నారు. కుమారుడు వెంకటేష్ తూగుంద్రం ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. అతనికి ఏడాది క్రితం జ్వరం రావడంతో చిత్తూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య చికిత్సలు అందించారు. ఆపై వివిధ సమస్యలు రావడంతో చీలాపల్లి సీఎంసీకి తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్లు పరీక్షించి వెంకటేష్‌కి లివర్ సమస్య ఉన్నట్లు నిర్ధారించారు. ఏడాదిగా రూ.8 లక్షల వరకు అప్పు చేసి మందులు, మాత్రలతో నెట్టుకొస్తున్నారు. కానీ బిడ్డ పరిస్థితి మాత్రం మెరుగు పడలేదు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు.


ప్రాణాలు అడ్డుపెట్టిన తల్లి!

ఈ క్రమంలో తన తల్లి నీతు లివర్‌ను కొంత తీసి బిడ్డకు పెట్టాలని నిశ్చయించారు. దానికి డాక్టర్లు కూడా అంగీకరించారు. అయితే చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితుల్లో తల్లీబిడ్డ ఆపరేషన్ తర్వాత పరిస్థితి ఏంటని మదనపడుతున్నారు. ఆపరేషన్‌కు రూ.20 లక్షలు, బాధితులు కోలుకోవడానికి మరో రూ.పది లక్షల వరకు అవసరముంటుందని డాక్టర్లు చెబుతున్నారు.

ప్రాణభిక్ష పెట్టండి సారూ!

సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేష్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావుతో పాటు దాతలు తమ కొడుకుకు ప్రాణ భిక్ష పెట్టాలని తల్లిదండ్రులు అభ్యర్థిస్తున్నారు. లివర్ మార్పిడి కోసం ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నారు. దాతలు ఎవరైనా తమకు సహాయం చేయదలిస్తే ఫోన్‌పే నం.9398226262 సాయం చేసి ఆదుకోవాలని చేతులెత్తి వేడుకుంటున్నారు.

పెరటాసి మాసం.. భక్తి పారవశ్యం





పాదాల మండపం వద్ద భక్తుల పూజలు

పెరటాసి మాసం నాలుగో శనివారం సందర్భంగా ఏడుకొండలస్వామి సేవకు భక్తజనం పోటెత్తింది. భక్తులు తిరుమలేశుని దర్శనానికి వెళుతూ పాదాల మండపం వద్ద పిండి దీపాలు వెలిగించి, భక్తి పారవశ్యంతో మొక్కులు తీర్చుకున్నారు. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గాల్లో కాలినడకన శ్రీవారిని సన్నిధికి చేరుకున్నారు. మెట్టు మెట్టుకు ప్రణామం చేసుకుంటూ తిరుమలకు వెళ్లారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఎన్టీఆర్ జలాశయం గేట్ల ఎత్తివేత



చిత్తూరు-పెనుమూరు రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

పెనుమూరు(కార్వేటినగరం): జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు కలవకుంట వద్ద ఉన్న ఎన్టీర్ జలాశయం గేట్లను శనివారం ఇరిగేషన్ అధికారులు ఎత్తివేశారు. మొత్తం 6 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. జలాశయానికి ఎగువ ప్రాంతాలైన పూతలపట్టు, పాకాల, దామలచెరువు, ఐరాల ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జలాశయానికి భారీగా వరద నీరు చేరుతోంది. పది వేల క్యూసెక్కుల నీరు చేరడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసినట్టు జలవనరుల శాఖ ఏఈ భరత్ తెలిపారు. చిత్తూరు– పెనుమూరు జాతీయ రహదారిపై జలాశయం నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. జలాశయానికి దిగువన ఉన్న జీడీనెల్లూరు ప్రజలు, అలాగే నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులు ఎలాంటి పరిస్థితుల్లోనూ నదిని దాటేందుకు సాహసించొద్దని సూచించారు.

ఎఫ్‌సీ రూటే సపరేటు

'మేము ఆటో డ్రైవర్లం. ఎఫ్‌సీకి నేరుగా వస్తే పని కాదు.. వస్తే సాకులు చెప్పి రిజెక్టు చేస్తున్నారు. అదే ఏజెంట్ల ద్వారా వస్తే తక్షణం పనులు జరుగుతున్నాయి. ఆటోకు ఎఫ్‌సీ గడువు తీరి నాలుగు నెలలు గడుస్తోంది. దీనికారణంగా ఆన్‌లైన్‌లో చలానా రూ.1,400 వరకు వచ్చింది. ఒక్కో ఆటోకు ఓ ఏజెంట్ రూ.3,400 వరకు వసూలు చేస్తున్నాడు. లేకుంటే ఒకటికి రెండు సార్లు రావాలంటే ఇబ్బంది పడాలి, జిల్లా అంతటికీ ఇదొక్కటే సెంటర్..₹ అంటూ వారి ఇబ్బందులను బహిరంగంగానే ఆటో డ్రైవర్లు 'సాక్షి'కి వివరించారు.

- వాహనాలకు ఎఫ్‌సీ ఇచ్చేందుకు అదనపు వసూళ్లు
- ఒక్కో వాహనానికి ఒక్కో రేటు
- ఏజెంట్ ద్వారా వెళ్తేనే..
- లేదంటే వాహనాన్ని తిప్పి పంపడం ఖాయం
- కమీషన్ ఇస్తేనే సర్టిఫికెట్ మంజూరు
- పట్టించుకోని అధికారులు



ఏటీసీ



ఎఫ్‌సీకి వచ్చిన వాహనాలు

కాణిపాకం : ఇటీవల ఏర్పాటు చేసిన ఆర్టీఏ కార్యాలయానికి అనుబంధంగా నడుస్తున్న ఫిట్‌నెస్ సెంటర్ (గవర్నమెంట్ అప్రూవ్డ్ ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్)లో అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. ప్రతి వాహనానికీ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి అనే ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఆయా వాహనాలకు యజమానుల నుంచి భారీగా కమీషన్లు తీసుకుంటూ సర్టిఫికెట్లు అందిస్తున్నారు. ఏజెంట్లుగా అవతారమెత్తిన దళారులు ఈ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. వీటి కట్టడికి క్లెయిం వేసే వారు లేకపోవడంతో అడ్డూ అదుపు లేకుండా దోచుకుంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

అన్ని వాహనాలకూ ఇక్కడే.. పరీక్ష !

జిల్లా కేంద్ర సమీపంలోని బంగారుపాళ్యం వద్ద ఇటీవల ఆటోమెటిక్ ఫిట్‌నెస్ స్టేషన్ ఏర్పాటయ్యింది. ఎఫ్‌సీ కోసం జిల్లాలోని ద్విచక్ర వాహనాలు మినహా మిగిలిన అన్ని వాహనాలు ఇక్కడే పరీక్షించుకోవాలి. కుప్పం, పుంగనూరు, నగరి, పలమనేరు నియోజకవర్గాల వారికి ఈ టెస్టింగ్ సెంటర్ ఇబ్బందికరంగా మారింది. రానుపోను ఒక రోజంతా కేటాయించాల్సి వస్తోంది. ఒక వేళ టెస్ట్ పాస్ కాకపోతే మళ్లీ రావాల్సి వస్తోంది. దీన్ని అదునుగా చేసుకుని కొందరు వసూళ్లకు తెరలేపారు. పాత వ్యక్తులే ఇక్కడ ఏజెంట్‌గా పాతుకుపోయి దందా కొనసాగిస్తున్నారు.

పాతుకుపోయారు

ఇన్నాళ్లు కార్యాలయంలో పాతుకుపోయిన ఏజెంట్లే.. ఇప్పుడు ఏటీఎస్ వద్ద పాగా వేశారు. వారి కన్నుసన్నల్లోనే ఏటీఎస్ పరీక్షలు జరుగుతున్నాయి. ఇక్కడ ఏజెంట్లకు ఆయా వాహనాలకు సుమారు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు కమీషన్ ముట్టజెప్తేనే బండి పాస్ అవుతున్నాయి. లేదంటే సాకులు వెతికి గేటు నుంచి వెనక్కి పంపేస్తారు. పొరపాటున ఎవరైనా సిఫార్సు ద్వారా చలానా మాత్రమే తీసి టెస్టింగ్‌కు పంపిస్తే మాత్రం, లేనిపోని కారణాలు చెప్పి ఫిట్‌నెస్ ఫెయిల్ చేసిన సందర్భాలు కోకొల్లలు. ఇక బండి రాకున్నా కూడా రూ.10 వేలు ఇస్తే పరీక్ష చేసేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.

గంటల కొద్దీ నిరీక్షణ

కొన్నేళ్ల కిందటి వరకు ఆర్టీఏ అధికారుల ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కావాలంటే క్షణాల్లోనే ఇచ్చేవారు. ఆయా వాహనాలకు సంబంధించిన కాగితాలు చూసి ఆర్టీఏ సిబ్బంది వాహనాన్ని డ్రైవింగ్ చేసి పంపేవారు. కానీ ప్రస్తుతం ఫిట్‌నెస్ కేంద్రంలో ఏదైనా వాహనం లోపలకు వెళ్తే మాత్రం గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. ఉదయం వెళ్లిన బండ్లు సాయంత్రానికే తిరిగి వస్తాయి. సహనం కోల్పోతున్న వాహన డ్రైవర్లు ఫిట్‌నెస్ కేంద్ర సిబ్బందితో వాగ్వావాదం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.

అంతా ఏజెంట్ల సమక్షంలోనే..

గత ప్రభుత్వంలో ఆర్టీఏ పనులు వాహన్ యాప్‌లో, స్థానిక సచివాలయంలో త్వరితగతిన జరిగేవి. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో ఏజెంట్లతోనే అంతా కమీషన్ పద్ధతిలో ఫిట్‌నెస్ కేంద్రంలో జరగడం గమనార్హం. ప్రతీ ఫైల్‌కు ఒక్కో రేటు పెట్టి ఆ రేటును ఏజెంట్లకు ముట్టజెప్పితేనే బండికి ఫిట్‌నెస్ అందిస్తారు. అయితే ఇవేమీ అక్కడ చెల్లుబాటు కావడం లేదు. కేవలం ఏజెంట్ల చేతిలోనే జరిగిపోతున్నాయి. పట్టించుకునే వారు లేక మూముళ్ల వ్యవహారం మితిమీరిందని పలువురు ఆరోపిస్తున్నారు.

ముక్కుపిండి వసూళ్లు

జిల్లాలోని ట్రాన్స్‌పోర్ట్, నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు సంబంధించి ఇక్కడ నుంచే ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కారు, బస్సు, ఆటో, లారీ ఏ వాహనమైనా ప్రభుత్వానికి కట్టాల్సిన చలానా రూ.800 నుంచి రూ.2,000 లోపు ఉంటుంది. ఆటోకు రూ.600, టాటా ఏస్, బొలెరో, నాలుగు చక్రాల గూడ్స్ వాహనాలకు రూ.1,200, సెవెన్ సీటర్ మోటర్ క్యాబ్‌కు రూ.2 వేలు, టెంపో వాహనాలకు రూ.2,500, ఎంజీవీ వాహనాలకు రూ.2,500, పది చక్రాల టిప్పర్‌కు రూ.3 వేలు, 12 చక్రాల లారీ (టిప్పర్)కు రూ.3,200, 14, 16 చక్రాల లారీకి రూ.4 వేలు, బస్సుకు రూ.3,500, ట్రాక్టర్‌కు రూ.వెయ్యి చలానా కట్టాలి. అయితే ఫీజులతో పాటు అదనంగా వసూలు చేస్తుండడంతో వాహనదారులు లబోదిబోమంటున్నారు. ఏ వాహనానికి ఎంత మామూళ్లు వసూలు చేయాలో ముందుగానే ధర నిర్ణయించి కరపత్రం రూపంలో ఏజెంట్లకు అందజేయడం, ఆ ప్రకారమే మామూళ్ల వసూలు చేస్తుండడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

డబ్బులు ఇవ్వొద్దు

ఒకప్పుడు వాహనానికి ఫిట్‌నెస్ పరీక్షలు మా ఆర్టీఏ పరిధిలో ఉండేవి. ఇప్పుడు అంతా ప్రైవేటుపరమైంది. బండిని సక్రమంగా టెస్టుకు తీసుకెళ్లండి. లోటుపాట్లు లేకుండా చూసుకోండి. అసలు డబ్బులు ఇవ్వొద్దు. ఏదైనా ఫిర్యాదు చేస్తే తక్షణం స్పందిస్తాం. చర్యలు తీసుకుంటాం.

– కృష్ణవేణి, జేటీసీ, రవాణాశాఖ

క్లుప్తంగా

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ : జాతీయ స్థాయి ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ, 9వ తరగతులలో ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎన్.విశ్వనాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1, 2014 నుంచి 2016 మధ్య జన్మించిన విద్యార్థులు ఆరో తరగతి ప్రవేశాలకు, 9వ తరగతిలో ప్రవేశాల కోసం 2011 ఏప్రిల్ 1వ తారీఖు నుంచి 2013 మార్చి 1వ తారీఖు మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష విధానం, నమూనా ప్రశ్నలు, మాక్ టెస్టులు, కోచింగ్‌తో పాటు మరిన్ని వివరాలకు తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రం నందు లేదా 8688888802 / 9399976999 నంబర్ల నందు సంప్రదించాలని ఆయన తెలిపారు.

మద్యం విక్రేత అరెస్ట్

చౌడేపల్లె: మండలంలోని లద్దిగం గ్రామంలో మద్యాన్ని విక్రయిస్తున్న నూర్‌బాషాను అరెస్ట్ చేసినట్లు ట్రైనీ ఎస్ఐ మణికంఠేశ్వరరెడ్డి శనివారం తెలిపారు. రహస్య సమాచారం మేరకు దాడులు నిర్వహించగా పట్టుబడినట్లు చెప్పారు. అతని వద్ద గల 24 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్ట్

పలమనేరు: పోక్సో కేసులో ఓ యువకుడ్ని పట్టణ సమీపంలోని నాగమంగళం ఫ్లైఓవర్ వద్ద శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ మురళీమోహన్ తెలిపారు. వివరాలు.. ఈ నెల 7న గంటావూరుకు చెందిన శ్యామలాదేవీ అనే మహిళ 16 ఏళ్ల తన కుమార్తె కనిపించడం లేదంటూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. దర్యాప్తులో భాగంగా బాలికను శుక్రవారం ట్రేస్ చేసి విచారించగా తనని పెద్దపంజాణి మండలం, పంజాని సత్రానికి చెందిన షారూక్ అనే వ్యక్తి బలవంతంగా తీసుకెళ్లి, తనపై లైంగికదాడికి పాల్పడ్డాడని పోలీసులకు తెలిపింది. దీంతో పోక్సో కేసుగా నమోదు చేసి ముద్దాయిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు పేర్కొన్నారు.

ఉగ్రరూపం దాల్చిన

బహుదానది

- కొట్టుకుపోయిన నాలుగు కల్వర్టులు
- వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

తవణంపల్లె: మండలంలోని బహుదా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలతో పాటు అరగొండ వద్ద బహుదానది ఉగ్రరూపం దాల్చింది. పడమటి మండలాల్లోని అడవుల్లో నుంచి భారీగా వర్షపు నీరు చేరుతోంది. మాధవరం వంక, బోయపల్లె వంక, మత్స్యం వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఇవి బహుదానదిలో కలవడంతో నదికి వరద నీరు పోటెత్తింది. శనివారం సాయంత్రానికి నదిలో నీటి శాతం కొంతమేర తగ్గింది.

తెగిన కల్వర్టులు

ప్రతి ఏటా భారీ వర్షాలప్పుడు కల్వర్టులు తెగిపోవడం రివాజుగా మారుతోంది. అరగొండ–గాజులపల్లె మధ్యలో ఉన్న కల్వర్టు, గాజులపల్లె–సరకల్లు రోడ్డు మధ్యలో తొడతర దగ్గర ఉన్న కల్వర్టు, అరగొండ– ఎ.గొల్లపల్లెకు వెళ్లే దారిలోని కల్వర్టు, మత్స్యం క్రాస్– ఎగువ మత్స్యం వెళ్లే దారిలోని కల్వర్టులు వరద ఉధృతికి కోతకు గురయ్యాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కనీసం పాల వ్యాన్లు, స్కూల్ బస్సులు కూడా తిరగడం లేదు. వీటికి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



గాజులపల్లె సమీపంలో బహుదానది ప్రవాహానికి కొట్టుకుపోయిన కల్వర్టు

జాగ్రత్తగా ఉండాలి

మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరో 35 గంటల పాటు స్థానికులు అప్రమత్తంగా ఉండాలి. వర్షాలు తగ్గుముఖం పట్టి వాగుల్లో ప్రవాహం ఉధృతి తగ్గే వరకు జనాలు తెగిన కల్వర్టులపై వెళ్లరాదు. వరద ఉధృతికి దెబ్బతిన్న కల్వర్టు దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. వాహనాలు, ప్రజలు వెళ్లకుండా అడ్డుకట్టలు వేయించారు.

– సుధాకర్, తహసీల్దార్



అరగొండ-ఎ.గొల్లపల్లె రోడ్డులో కొట్టుకుపోయిన కల్వర్టు



అరగొండ- గాజులపల్లె రోడ్డులో కల్వర్టు దెబ్బతినడంతో అడ్డుకట్ట వేసిన అధికారులు

మళ్లీ ఏనుగుల దాడి



కోటపల్లెలో ఏనుగులు తొక్కేసిన అరటి పంట

పులిచెర్ల(కల్లూరు): మండలంలో రెండు రోజుల తర్వాత తిరిగి ఏనుగులు ప్రవేశించాయి. భాకరాపేట అడవుల్లోకి వెళ్లి పోయాయనుకుని రైతులు ఊపిరి పీల్చుకున్నారు. తిరిగి దర్శనమివ్వడంలో బెంబేలెత్తిపోతున్నారు. శనివారం తెల్లవారు జామున పాతపేట, ఎద్దులవారిపల్లె, కోటపల్లె, పాళెం గ్రామాల్లోని పొలాల్లో ప్రవేశించి పంటలను ధ్వంసం చేశాయి. రైతులు హరి, ప్రసాద్, నాగరాజ, మునిరత్నం పొలాల్లో అరటి, టమాట, వేరుశనగ, మామిడి వరి పంటలను తొక్కి నాశనం చేశాయి.

డీఎస్‌డీఓగా ఉదయ్‌భాస్కర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో)గా ఉదయ్‌భాస్కర్‌ను నియమిస్తూ శాప్ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. సత్యసాయి జిల్లా డీఎస్‌డీవోగా ఉన్న ఆయన చిత్తూరుకు బదిలీపై రానున్నారు. ఇప్పటి వరకు డీఎస్‌డీవోగా ఉన్న బాలాజీని చిత్తూరులోనే ఖోఖో కోచ్‌గా కొనసాగించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కత్తెర పురుగుతో జాగ్రత్త

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో 'తీపి మొక్కజొన్న' సాగు చేస్తున్న పొలాల్లో 'కత్తెర పురుగు' ఆశించి నష్టం కలిగిస్తున్నట్లు జిల్లా ఏరువాక కేంద్ర జిల్లా కో–ఆర్డినేటర్ రామకృష్ణారావు తెలిపారు. ఇలాంటి తరుణంలో రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. లింగాకర్షక బుట్టలను ఎకరానికి 10 చొప్పున విత్తిన వెంటనే అమర్చాలన్నారు. విత్తినప్పటి నుంచి 25 రోజుల వరకు.. 5 శాతం వేప గింజల కషాయాన్ని (లేదా) అజాడిరక్టిన్ 1500 పీ.పి.యం. 5 మి.లీ./లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. విత్తిన 25 రోజు నుంచి 40 రోజుల వరకు కత్తెర పురుగు లార్వాలను నివారించడానికి ఒక ఎకరాకు (5–20శాతం ఆకులు దెబ్బతింటే)ఎమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రా, 20శాతం ఆకులు దెబ్బతింటే ఏకరానికి రైనాక్సిఫైర్ 100 మి.లీ లేదా స్పైనోటరామ్ 100 మి.లీ పిచికారీ చేయాలన్నారు. విత్తిన 40 రోజు నుంచి 60 రోజుల లోపు ఎకరాకు స్పైనోసాడ్– 70 మి.లీ, రైనాక్సిఫైర్ 80 మి.లీ, స్పైనోటరామ్ 100 మిలీ, ఎమామెక్టిన్ బెంజోయేట్– 80 గ్రా, థయేమిథాక్సామ్‌తో పాటు లామ్డా సైహలోత్రిన్ 100 మి.లీలతో రైతులు పిచికారీ చేసుకోవాలని ఆయన సూచించారు.

పోలీసు కస్టడీకి నిందితులు

చిత్తూరు లీగల్: చిత్తూరులో గత నెల వెలుగు చూసిన మైనర్ బాలికపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు శనివారం కస్టడీకి తీసుకున్నారు. ఈ కేసులో అరెస్టయిన మహేష్ .. కిషోర్, హేమంత్‌ను కస్టడీకి ఇస్తే మరిన్ని వివరాలు రాబట్టాల్సి ఉందని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి నిందితులను కస్టడీకి అనుమతిస్తూ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ఈ నెల 14 వరకు కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది.

నియామక పత్రాల జారీ

చిత్తూరు కలెక్టరేట్ : డీఎస్సీ కొత్త టీచర్ల నియామకానికి సమయం ఆసన్నమైంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,394 మంది సోమవారం నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. కొత్తగా విధుల్లో చేరుతున్న గురువులు సామాజిక, నైతిక విలువలతో విద్యార్థులకు పాఠాలు బోధించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. వృత్తిపట్ల అంకిత భావంతో పనిచేసి పిల్లల అభివృద్ధి, సర్కారు బడుల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొంటున్నారు. ఈ మేరకు కొత్త టీచర్లకు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, డీఈఓ వరలక్ష్మి చేతుల మీదుగా శనివారం నియామకపత్రాలు అందజేశారు.

రైలు కింద పడి వృద్ధుడి మృతి

పుత్తూరు: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకొంది. రైల్వే ఎస్ఐ మధు కథనం మేరకు.. పుత్తూరు మండల పరిధిలోని ఎగువ తిరుమలకుప్పం గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వర్లు(77) తిరుపతికి వెళ్లడానికి స్థానిక రైల్వే స్టేషన్‌కు రామారావు కాలనీ నుంచి అడ్డదారిలో బయల్దేరాడు. ప్రమాదవశాత్తు కన్యాకుమారి వెళ్లే వివేక్ ఎక్స్‌ప్రెస్ కింద పడి మృతి చెందాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిరుత సంచారంపై అప్రమత్తమైన అధికారులు



సూచిక బోర్డులను పరిశీలిస్తున్న నూతన వీసీ

తిరుపతి సిటీ : ఎస్వీయూ స్టాఫ్ క్వార్టర్స్ సమీపంలో చిరుత సంచారంపై వీసీ ఆచార్య నర్సింగరావు విశ్వవిద్యాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆ పరిసరాల్లో ఆయన పరిశీలించి సెక్యూరిటీ సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. చిరుత సంచారంపై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించే ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రాంతాల్లో నివసించే కుటుంబాలు, ఆ ప్రాంతంలో తిరిగే వారికి తెలిసేలా బారికేడ్లను, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

అభిషేక సింహాసనం బహూకరణ

చంద్రగిరి : శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారికి దాతలు అభిషేక సింహాసనాన్ని బహూకరించారు. శనివారం ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి అందజేశారు. బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీకు చెందిన మదన్ మోహన్ రెడ్డి, యువజ్యోతి దంపతులు స్వామి వారికి కైంకర్యాలను నిర్వహించేందుకు అభిషేక సింహాసనం అవసరమని తెలుసుకుని, అభిషేక సింహాసనాన్ని రూ.9 లక్షల వ్యయంతో తయారు చేయించారు. అనంతరం వాటిని ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వరద బాధితులకు అన్నదానం



వరద బాధితులకు అన్నదానం చేస్తున్న విజయానందరెడ్డి, పార్టీ కార్యకర్తలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని నీవానది ప్రాంతంలోకి వరదనీళ్లు రావడంతో అక్కడి కాలనీ వాసులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి అన్నదానం చేశారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అల్తాఫ్ ఆధ్వర్యంలో అభాగ్యులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వరద బాధితులతో విజయానందరెడ్డి మాట్లాడి వాళ్ల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వరద నీళ్లు ఇళ్లలోకి రాకుండా తమకు శాశ్వత పరిష్కారం చూపించాలని పలువురు విజయానందరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి పార్టీ ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా నీవానది పరివాహక ప్రాంతంలో ప్రహరీ నిర్మించాలన్నారు. ఏడాదిన్నరలో ఇప్పటికే రెండు మార్లు వరదనీళ్లు ఇక్కడి ప్రజలను ఇబ్బందులకు గురిచేశాయన్నారు. ఎమ్మెల్యే తన హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వెంకటేష్, నవాజ్, మురుగదాస్, గౌస్‌ఖాన్, నిజాం, గఫార్, రియాజ్ పాల్గొన్నారు. కాగా అన్నదానం కూడా చేయనీకుండా పలువురు పోలీసులు అక్కడి నుంచి పంపించేయడం గమనార్హం.

షెడ్డు తొలగిస్తావా!

కేసులు పెట్టమంటావా?

- ఓ వ్యక్తిపై టీడీపీ నాయకుల దాష్టీకం
- వంతపాడిన అధికారులు

పాలసముద్రం: 'షెడ్డు తొలగిస్తావా.. కేసులు పెట్టమంటావా..?' అంటూ టీడీపీ నాయకుల ఒత్తిడితో అధికారులు ఓ వ్యక్తిని బెదిరించిన ఘటన మండలంలో సంచలనంగా మారింది. వివరాలు.. మండలంలోని వనదుర్గాపురం ఆదిఆంధ్రవాడకు చెందిన పీ.కృష్ణయ్యకు 2019 నుంచి జగనన్న కాలనీలోని ఖాళీ స్థలంలో కొబ్బరి కీతులతో గుడిసె వేసుకుని అందులో నివాసముంటున్నాడు. వనదుర్గాపురంలో ఉన్నట్లు రేషన్ కార్డు, ఆధార్ కార్డు కూడా ఉంది. కొన్ని రోజుల క్రితం అప్పు చేసి పక్కనే ఇనుపరేకులతో షెడ్డు వేశాడు. దీన్ని గమనించిన వనదుర్గాపురంలోని టీడీపీ నాయకులు డబ్బులిస్తే పట్టా ఇప్పిస్తామని, లేకుంటే షెడ్డుని తొలగించి బయటకు వెళ్లగొడతామని బెదిరించారు. కానీ కృష్ణయ్య వాటిని పెద్దగా పట్టించుకోలేదు. ఆగ్రహించిన టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ అరుణకుమారి, ఆర్ఐ దేవి, వీఆర్ఓ వెంకటాచలం శనివారం షెడ్డు వద్దకు చేరుకుని పరిశీలించారు. రాజకీయ ఒత్తిడి ఎక్కువైందని, వెంటనే షెడ్డుని తీసేయాలంటూ హుకుం జారీచేశారు. లేకుంటే కేసులు పెడతామంటూ వీఆర్వో వెంకటాచలం హెచ్చరించారు. కృష్ణయ్య మాట్లాడుతూ వనదుర్గాపురం పంచాయతీల్లో అగ్రకులస్తులకు ఒక్కో కుటుంబంలో రెండు, మూడు పట్టాలున్నాయని, రోజూ కూలికెళ్లే తనకు ఇంటి పట్టా ఇవ్వమంటే ఎలా అని టీడీపీ నాయకులతోపాటు అధికారులను నిలదీశారు. సంబంధిత ఉన్నతాధికారులైనా స్పందించి న్యాయం చేయాలని కోరారు.



గుడిసెను తొలగించాలంటున్న రెవెన్యూ అధికారులు

అంబేడ్కర్ భిక్షతోనే మనందరికీ పదవులు

వెదురుకుప్పం: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పెట్టిన భిక్షతోనే మనమందరం ఎమ్మెల్యేలు, మంత్రులుగా పదవిలో కొనసాగుతున్నామని హోం మంత్రి అనిత అన్నారు. శనివారం వెదురుకుప్పం మండలంలోని దేవళంపేట గ్రామంలో పర్యటించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అంబేడ్కర్‌కు జరిగిన అవమానం జాతికందరికీ జరిగినట్టేనన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇలాంటి కుయుక్తులు చేసి ప్రజలను మభ్యపెడుతున్నట్లు చెప్పారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్యేలు థామస్, మురళీమోహన్, ఎంఎస్‌రాజు, మాజీ ఎంపీటీసీ మోహన్‌మురళి పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న హోం మంత్రి అనిత, ఎమ్మెల్యేలు

తల్లిఒడికి చేరకనే..

- పురిటిబిడ్డ మృతి
- హైరిస్క్ అని చెప్పినా పట్టించుకోని సిబ్బంది
- పోలీసులకు ఫిర్యాదు

చౌడేపల్లె: పురిటిబిడ్డ తల్లి ఒడికి చేరకనే తిరిగిరాని లోకాలకు వెళ్లింది. ఆ కుటుంబమంతా విషాదంలో మునిగిపోయింది. బాధిత కుటుంబీకుల కథనం.. చౌడేపల్లె టౌన్, కుమ్మరవీధికి చెందిన ప్రసాద్, కవిత దంపతులకు పెళ్లైన ఏడాదికి కుమార్తె జన్మించినది. అప్పటి నుంచి సంతానం లేదు. ఇటీవలే కవిత మరోసారి గర్భందాల్చింది. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించగా హైరిస్క్ కేసుగా చౌడేపల్లె వైద్యులు నిర్ధారించారు. అందుకు తగినట్లుగా జాగ్రత్తలు తీసుకున్నారు. నెలలు నిండడంతో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో పురిటినొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు ప్రయివేటు వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ డాక్టర్ లేకపోగా అక్కడే విధుల్లో ఉన్న ఏఎన్ఎంకు హైరిస్క్ గర్భిణి కేసుగా తెలియజేసి అడ్మిట్ చేయించారు. డాక్టర్లు గర్భిణీని పట్టించుకోలేదు. నార్మల్ డెలివరీ చేయించాలని సమయం వృథా చేశారు. బిడ్డ సుమారు 3.75 కేజీల బరువు ఉండడంతో డెలివరీ కష్టతరంగా మారింది. సిబ్బంది అతికష్టం మీద శనివారం ఉదయం 10.10 గంటల మధ్య చిన్నపాటి సర్జరీ చేసి బిడ్డ బయటకు వచ్చేలా చర్యలు చేపట్టారు. అప్పటికే పురిటి బిడ్డ హార్ట్‌బీట్ ఆగిపోయింది. డాక్టర్ పరీక్షించి పురిటిబిడ్డ మృతి చెందినట్టు నిర్ధారించారు. తల్లిదండ్రులు బోరున విలపించారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ చనిపోయిందని, హైరిస్క్ కేసు అని చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. శస్త్ర చికిత్సచేసి ఉంటే తమ బిడ్డ బతికేదన్నారు. కడుపుపై ఒత్తడంతోపాటు, బలవంతంగా బిడ్డ బయటకు వచ్చేలా చేయడంతోనే చనిపోయిందని ఆరోపించారు. ఈ మేరకు వైద్య సిబ్బందిపై మదనపల్లె టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని, అలాగే ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబీకులు డిమాండ్ చేశారు. పురిబిడ్డను అశ్రునయనాల నడుమ చౌడేపల్లెలో అంత్యక్రియలు నిర్వహించారు. తల్లి ఆస్పత్రిలో చికిత్సపొందుతోంది.



వైద్యుల నిర్లక్ష్యానికి బలైన పురిటిబిడ్డ



మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతున్న కవిత